వైట్‌హౌస్ దగ్గర ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన

ట్రంప్‌కు వ్యతిరేకంగా సిన్సినాటిలో ప్రజల నిరసన ప్రదర్శన

అమెరికాలో రాచరికమా?

- ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా మళ్లీ పెద్ద ఎత్తున నిరసనలు
- '50501' పేరిట ఆందోళనలు
- ట్రంప్ గద్దె దిగాలని డిమాండ్
- భయం లేదు.. వలసదారులకు స్వాగతం అంటూ నినాదాలు

న్యూయార్క్, ఏప్రిల్ 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలపై ప్రజల్లో ఆగ్రహం, అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఈ నెల 5న హ్యాండ్సాఫ్ పేరిట దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించగా, తాజాగా శనివారం '50501' పేరిట భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ట్రంప్ దిగిపో అంటూ అమెరికా పౌరులు నినదించారు. పౌర హక్కులకు, చట్ట నిబంధనలకు ట్రంప్ పాతరేస్తున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. 'అమెరికాలో రాజులు లేరు', ఫ్యూడల్ యుగం ముగిసింది అన్న స్లోగన్‌లతో హోరెత్తిస్తూ న్యూయార్క్, వాషింగ్టన్‌తో పాటు దేశంలోని పలు నగరాలలో వేలాది మంది రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. నిరంకుశత్వాన్ని ఎదిరించండి, అమెరికాలో రాజులు లేరు అని నినాదాలు రాసిన ప్లకార్డులు చేతబట్టిన పౌరులు న్యూయార్క్‌లోని సిటీ మెయిన్ లైబ్రరీ బయట భారీ ప్రదర్శన జరిపారు.

వలసదారులకు స్వాగతం

సరైన పత్రాలు లేవంటూ వేలాదిమంది వలసవాదులను ట్రంప్ ప్రభుత్వం దేశం నుంచి బహిష్కరించడాన్ని, కొందరు విద్యార్థులను అరెస్ట్ చేయడాన్ని పౌరులు తీవ్రంగా నిరసించారు. భయం లేదు.. వలసవాదులకు దేశం స్వాగతం చెబుతుంది అంటూ నినాదాలు చేస్తూ వారికి మద్దతు ప్రకటించారు. అలాగే రాజ్యాంగం కల్పించిన హక్కులను ట్రంప్ ప్రభుత్వం కాలరాయడం పట్ల వాషింగ్టన్‌లో నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. నాజీ నేత అడాల్ఫ్ హిట్లర్ పాలనలో ఏం జరిగిందో ఇప్పుడు ట్రంప్ హయాంలో అమెరికాలోనూ అదే జరుగుతున్నదని ఒక నిరసనకారుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు.

అభిశంసించండి.. తొలగించండి..

ఇక శాన్‌ఫ్రాన్సిస్కోలో అయితే ట్రంప్‌ను అభిశంసించండి, తొలగించండి అంటూ నిరసనకారులు ప్లకార్డులు ప్రదర్శించారు. తమ బాధను వ్యక్తం చేసేందుకు గుర్తుగా కొన్ని చోట్ల అమెరికా జెండాను తలకిందులుగా ఎగురవేశారు. 50 నిరసనలు, 50 రాష్ట్రాలు, ఒక ఉద్యమాన్ని ప్రతిబింబించేలా '50501' పేరుతో ఏర్పాటు చేసిన గ్రూప్ ఈ ఆందోళనలకు నాయకత్వం వహించింది.

దేశ ప్రజలే బాధితులు

ట్రంప్ విధానాల వల్ల సొంత దేశ ప్రజలే బాధితులుగా మారుతున్నారని, దీనిని ప్రతిఘటించాలని 80 ఏండ్ల వృద్ధుడొకరు పేర్కొన్నారు. 'అమెరికాలో స్వేచ్ఛ కోసం పోరాడాల్సిన కీలక సమయం.కొన్నిసార్లు స్వతంత్రం కోసం పోరాడాలని కూడా వారికి చెబుతా' అని మరో వ్యక్తి తెలిపారు. వేలాది మంది ఫెడరల్ ఉద్యోగుల తొలగింపు, సంస్థల మూసివేతతో పాటు పలువురికి దేశ బహిష్కరణ శిక్ష విధించడాన్ని ఆందోళనకారులు ప్రశ్నించారు.

మస్క్‌కు వ్యతిరేకంగా కూడా..

డౌన్‌టౌన్ పోర్ట్‌లాండ్‌లో వేలాది మంది ప్రజలు ర్యాలీ నిర్వహించగా, ఒరెగాన్, అలస్కా, శాన్‌ఫ్రాన్సిస్కో, పసిఫిక్ సముద్రం వద్ద శాండీ బీచ్ పొడవునా నిరసనలు తెలిపారు. అలాగే ప్రభుత్వాన్ని దిగజార్చడంలో కీలక పాత్ర వహించిన ఎలాన్ మస్క్‌కు వ్యతిరేకంగా టెస్లా కంపెనీ కారు డీలర్ షిప్‌ల ఎదుట నిరసనలకు దిగారు. మరికొన్ని చోట్ల షెల్టర్లలో స్వచ్ఛంద సేవ వంటి కమ్యూనిటీ సేవా ఆధారిత కార్యక్రమాలు నిర్వహించారు.

నా చితాభస్మాన్ని మురికి కాల్వలో పడేయండి!

- భార్య వేధింపులు తాళలేక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య
- ఆస్తి రాసివ్వాలని భార్య, ఆమె కుటుంబ సభ్యుల తీవ్ర ఒత్తిళ్లు
- లేకపోతే వరకట్న వేధింపుల కేసు పెడతామంటూ బెదిరింపులు
- ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన

లక్నో: భార్య వేధింపులను భరించలేక ఉత్తరప్రదేశ్, ఔరైయా జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మోహిత్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నారు. బలవన్మరణానికి ముందు ఆయన ఓ వీడియో రికార్డు చేశారు. తన భార్య, ఆమె తల్లి, సోదరుడు తనను హింసించిన తీరును అందులో వివరించారు. తన ఇంటిని, ఆస్తులను తన భార్య ప్రియా యాదవ్ పేరిట రాయాలని తీవ్రంగా ఒత్తిడి చేశారని తెలిపారు. ఆస్తులను రాసి ఇవ్వకపోతే, వరకట్న వేధింపుల కేసు పెడతామని బెదిరించారన్నారు. ''మీకు ఈ వీడియో కనిపించేసరికి, నేను ఈ లోకం నుంచి వెళ్లిపోతాను. పురుషుల కోసం ఓ చట్టం ఉండి ఉంటే, నేను ఈ పని చేసి ఉండేవాడిని కాదేమో. నేను నా భార్య, ఆమె కుటుంబ సభ్యులు పెడుతున్న హింసను భరించలేకపోతున్నాను'' అని ఆ వీడియోలో మోహిత్ చెప్పారు. తన భార్యకు గర్భస్రావం చేయించాలని ఆమె తల్లి ఒత్తిడి చేశారని, అన్ని ఆభరణాలు, చీరలు ఆమె వద్దనే ఉంచుకున్నారని తెలిపారు. 'నేను మరణించిన తర్వాత అయినా నాకు న్యాయం జరగకపోతే, నా చితాభస్మాన్ని మురుగు కాలువలో కలిపేయండి. అమ్మా, నాన్నా, దయచేసి క్షమించండి. మీ ఆశలకు తగినట్లుగా నేను ఉండలేకపోయాను' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏడేండ్లు ప్రేమించి పెండ్లి..

పోలీస్ సూపరింటెండెంట్ అభయ్‌నాథ్ త్రిపాఠీ మాట్లాడుతూ, నోయిడాలోని ఓ హోటల్ గదిలో మోహిత్ మృతదేహాన్ని గుర్తించి, పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు. మోహిత్ సోదరుడు తరణ్ ప్రతాప్ మాట్లాడుతూ, మోహిత్ నోయిడాలోని ఓ సిమెంట్ కంపెనీలో ఇంజినీరుగా పని చేస్తున్నాడని, అక్కడే ఆయనకు ప్రియ యాదవ్ పరిచయమైందని చెప్పారు. ఏడేళ్లపాటు వీరిద్దరూ ప్రేమించుకున్నారని, అనంతరం వారికి పెండ్లి చేశామని తెలిపారు. పెండ్లి జరిగిన మూడు నెలల వరకు అంతా బాగానే గడిచిందని, బీహార్‌లోని సమస్తిపూర్‌లో ఆమెకు టీచర్‌గా ఉద్యోగం వచ్చిన తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చిందని చెప్పారు. తమ కుటుంబం నుంచి ఆయనను వేరు చేసిందని చెప్పారు.

భార్య తల నరికి.. తలతో పోలీస్‌స్టేషన్‌కు

అస్సాంలో ఓ వృద్ధుడి కిరాతకం

గువహటి: అస్సాంలో 60 ఏండ్ల వృద్ధుడు ఘాతుకానికి పాల్పడ్డాడు. భార్యతో గొడవపడి ఆవేశంలో ఆమె తలనరికి.. అనంతరం తలతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఈ భయానక ఘటన శనివారం రాత్రి చిరాంగ్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర్ బల్లంగురికి చెందిన బితిశ్ హజోంగ్ శనివారం కూలి పని నుంచి ఇంటికి తిరిగి రాగానే భార్య బజంతితో చిన్న విషయమై గొడవ పడ్డాడు. ఆ తర్వాత ఆవేశంలో పదునైన ఆయుధంతో ఆమె తల నరికి హత్య చేశాడు. అనంతరం సైకిల్‌లో నేరుగా బల్లంగురి అవుట్‌పోస్ట్‌కు వెళ్లి పోలీసులకు భార్య తల అప్పగించి వారికి లొంగిపోయాడు. నిందితుడు నిత్యం భార్యతో చిన్న చిన్న విషయాలకు గొడవ పడేవాడని స్థానికులు తెలిపారు. బజంతి మృతదేహాన్ని శవ పరీక్షకు పంపారు. ఫోరెన్సిక్ నిపుణులు నమూనాలను సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాచరికం మళ్లీ రావాలి

- నేపాల్‌లో భారీ నిరసనలు.. కాఠ్మాండూలో రోడ్లపైకి వందలమంది
- హిందూ దేశంగా నేపాల్‌ను ప్రకటించాలని డిమాండ్

కాఠ్మాండూ: నేపాల్‌లో మళ్లీ రాచరిక పాలన రావాలని వందలాది మంది కాఠ్మాండూలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంటు, ప్రధాన మంత్రి నివాసం ఉన్న హై సెక్యూరిటీ జోన్ సమీపంలో రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీకి చెందిన దాదాపు 1,500 మంది ధర్నా చేశారు. 'గణతంత్ర విధానం నశించాలి', 'రాచరికం మళ్లీ రావాలి', 'నేపాల్‌ను హిందూ దేశంగా ప్రకటించాలి' అంటూ నినాదాలు చేశారు. ఆర్‌పీపీ చైర్మన్ రాజేంద్ర లింగ్డెన్, సీనియర్ నేతలు పశుపతి షంషేర్ రాణా, మాజీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ధ్రుబ బహదూర్ ప్రధాన్ తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ నేపథ్యంలో కాఠ్మాండూలోని కీలక ప్రాంతాల్లో వేలాది మంది పోలీసులను ప్రభుత్వం మోహరించింది. అనుమతిలేని ప్రదేశాల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఆర్‌పీపీ నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. నేపాల్ ప్రతినిధుల సభలో ఆర్‌పీపీ ఐదో అతి పెద్ద పార్టీ. పోలీసులు అరెస్ట్ చేసిన తమ నేతలను వెంటనే విడుదల చేయాలని ఈ పార్టీ డిమాండ్ చేసింది. తమ నిరసనలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

ట్రంప్ ప్రభుత్వంపై భారత్, చైనా విద్యార్థుల దావా

ఎఫ్-1 వీసాల రద్దుపై న్యాయ పోరాటం

వాషింగ్టన్: ఎఫ్-1 స్టూడెంట్ వీసాలను చిన్న చిన్న కారణాలను చూపుతూ అమెరికా ప్రభుత్వం రద్దు చేయడాన్ని ముగ్గురు భారతీయ విద్యార్థులు, ఇద్దరు చైనా విద్యార్థులు సవాల్ చేశారు. వీరు న్యూ హాంప్‌షైర్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా వేశారు. తమ ఎఫ్-1 స్టేటస్‌ను ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా రద్దు చేయడం వల్ల చట్టబద్ధమైన స్టూడెంట్ స్టేటస్‌కు తాము దూరమయ్యామని వాదించారు. తమ వీసాలను పునరుద్ధరించాలని, తమను నిర్బంధించడాన్ని, అమెరికా నుంచి పంపించేయడాన్ని ఆపాలని కోరారు. వందలాది మంది విదేశీ విద్యార్థుల ఎఫ్-1 వీసాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఏకపక్షంగా రద్దు చేసిందని తెలిపారు. అదేవిధంగా ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ పార్టిసిపెంట్స్ ఎఫ్-1 వీసాలను కూడా రద్దు చేసిందన్నారు. భారతీయ విద్యార్థులు మణికంఠ పసుల, లింఖిత్ బాబు గొర్రెల, తనూజ్ కుమార్ గుమ్మడవెల్లి, చైనా విద్యార్థులు హాంగ్రుయి ఝూంగ్, హాయాంగ్ ఆన్ ఈ దావాను దాఖలు చేశారు. లింఖిత్ బాబు గ్రాడ్యుయేషన్ వచ్చే నెలలో పూర్తవుతుంది. గుమ్మడవెల్లి, పసుల మాస్టర్స్ డిగ్రీ పూర్తి కావడానికి ఒక సెమిస్టర్ మిగిలి ఉంది. కోర్టు జోక్యం చేసుకోకపోతే వీరి ఆశలు అడియాశలు అవుతాయి.

ఈ వేసవిలో అమెరికా టూర్ చౌక!

ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో తగ్గిన విమాన చార్జీలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాల ప్రభావం విమాన చార్జీలపైనా పడింది. ఈ కారణంగా ఈ వేసవిలో భారత్-అమెరికా ప్రయాణ చార్జీలు 10-15 శాతం తగ్గాయి. ఈ నెల 19న అందుబాటులో ఉన్న మే నెల మధ్యలో షెడ్యూల్ కలిగిన ముంబై-న్యూయార్క్ విమాన టికెట్ ధర తక్కువగా రూ.37 వేలు ఉంది. తిరుగు ప్రయాణం టికెట్ ధర రూ.76 వేలుగా ఉంది. అమెరికాకు అత్యధికంగా వలస వెళ్లిన వారిలో భారతీయులు రెండో స్థానంలో నిలుస్తారు. అయితే ట్రంప్ విధానాల కారణంగా నిరుడుతో పోలిస్తే ఆ దేశానికి వెళ్లే భారత ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. నిరుడుతో పోలిస్తే విమాన టికెట్ ధరలు సుమారుగా 5-8 శాతం తగ్గాయని థామస్ కుక్ (ఇండియా) ప్రెసిడెంట్ రస్తోగీ తెలిపారు.

అమెరికాకు మహా మాంద్యం ముప్పు

- 2008 నాటి మాంద్యాన్ని మించిన సంక్షోభం
- బ్రిడ్జివాటర్ అసోసియేట్స్ వ్యవస్థాపకుడు రే డాలియో

వాషింగ్టన్: అమెరికా ఆర్థిక వ్యవస్థ పట్ల బ్రిడ్జివాటర్ అసోసియేట్స్ వ్యవస్థాపకుడు, బిలియనీర్ రే డాలియో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2008 నాటి ఆర్థిక మాంద్యం తీవ్రతకు మించిన ఆర్థిక సంక్షోభం ముప్పు కనిపిస్తున్నదని హెచ్చరించారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి కారణం కొంత వరకు ట్రంప్ దూకుడుగా అమలు చేస్తున్న వాణిజ్య విధానాలేనని చెప్పారు. చైనా నుంచి అమెరికాకు ఎగుమతులపై విధిస్తున్న టారిఫ్‌ల ప్రభావం చాలా ముఖ్యమైనదని తెలిపారు. ప్రధాన ఆర్థిక, రాజకీయ, భౌగోళిక రాజకీయ వ్యవస్థలు చెడిపోవడాన్ని చూస్తున్నామని, ఆర్థిక స్థిరత్వాన్ని చెప్పుకోదగ్గ స్థాయిలో దెబ్బతీసే అత్యంత అరుదైన సంఘటనగా దీనిని పరిగణించవచ్చన్నారు.

ఠాక్రేలు మళ్లీ ఏకం?

- చేతులు కలపనున్న ఉద్ధవ్, రాజ్ ఠాక్రే
- మహారాష్ట్రలో ఊహాగానాలు

ముంబై, ఏప్రిల్ 20: మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకోనుందా? దశాబ్దాలుగా విరోధులుగా ఉన్న ఇద్దరు నేతలు మళ్లీ ఏకమవుతారా? అన్న చర్చ ఇప్పుడు రాష్ట్రంలో నడుస్తున్నది. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధినేత రాజ్‌ఠాక్రేలు మళ్లీ చేతులు కలుపబోతున్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర, మహారాష్ట్రీయుల ప్రాముఖ్యతతో పోలిస్తే ఉద్ధవ్‌తో తనకున్న విభేదాలు చాలా స్వల్పమని రాజ్ ఠాక్రే అన్నారు. ఉద్ధవ్ స్పందిస్తే ఆయనతో కలిసి పనిచేయడానికి తాను సిద్ధమేనని ప్రకటించారు. దీనికి ఉద్ధవ్ కూడా సానుకూలంగా స్పందించడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. దీనిపై ఉద్ధవ్ సేన నేత సంజయ్ రౌత్ స్పందిస్తూ.. రాజకీయ పొత్తుకు సంబంధించి ఎలాంటి చర్చలు జరగలేదని, అయితే వీరి మధ్య భావోద్వేగ చర్చలు మాత్రమే జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే భవిష్యత్తులో రాజకీయంగా ఏకమవుతారా అన్న అంశాన్ని మాత్రం ఆయన తోసిపుచ్చలేదు.

ఇదే తొలిసారి కాదు..

ఈ ఇరువురు నేతలు తిరిగి కలిసిపోతున్నారంటూ వార్తలు రావడం ఇది తొలిసారి కాదు. గతంలో ఇదేవిధమైన ప్రచారం తీవ్రంగా జరిగింది. ఠాక్రే కుటుంబ సభ్యులు కూడా ఇద్దరినీ కలపడానికి పలు ప్రయత్నాలు చేశారు. కానీ అవి ఫలించ లేదు. రాజ్ ఠాక్రే పార్టీ ఎన్నికల్లో సీట్లు గెలుచుకోలేక పోతుంది.

యోగిని ప్రధానిగా ప్రమోట్ చేసేందుకే..

మహా కుంభమేళాను రాజకీయ కుంభమేళాగా మార్చిన బీజేపీ: అఖిలేశ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఉత్తరప్రదేశ్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ సర్కార్‌పై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ప్రధానిగా ప్రమోట్ చేసేందుకు రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన మహా కుంభమేళాను రాజకీయ కుంభమేళాగా బీజేపీ వాడుకుందని విమర్శించారు. సామాజిక విభజనను, సీఎం యోగి ఆదిత్యను ప్రోత్సహించడానికి చేసిన తతంగంగా ఆయన దీనిని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రెండు మతాల మధ్య చిచ్చును రేపుతున్నదని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే విమర్శలపై అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. 'దేశ ప్రధాని పదవికి సీఎం యోగి పేరును తీసుకొచ్చేందుకు బీజేపీ మహా కుంభమేళాను వాడుకుంది. కులం పేరుతోవిభజన తీసుకురావటం బీజేపీ ప్రణాళికాబద్ధమైన కార్యక్రమం' అని విమర్శించారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే

దేశవ్యాప్త సమ్మె

కేంద్రానికి ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: కేంద్ర ప్రభుత్వానికి ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు హెచ్చరికలు జారీ చేశారు. చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న కమీషన్, ఇతర డిమాండ్లను రానున్న మూడు నెలల్లోగా పరిష్కరించకపోతే దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని అల్టిమేటం జారీ చేశారు. భోపాల్‌లో శనివారం జరిగిన అసోసియేషన్ జాతీయ సమావేశం అనంతరం ఈ మేరకు ఒక తీర్మానం చేసినట్టు తెలిపారు. ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల డిమాండ్ల గురించి కేంద్ర పెట్రోలియం, గ్యాస్ మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాశామని చెప్పారు. ఇప్పుడు తమకు ఇస్తున్న కమీషన్‌కు, నిర్వాహక వ్యయానికి ఎంతమాత్రం పొంతన లేదని సంఘం అధ్యక్షుడు బీఎస్ శర్మ తెలిపారు. దీంతో తమ కమీషన్‌ను కనీసం రూ.150కు పెంచాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. డిమాండ్ లేకపోయినా గృహేతర సిలిండర్లను ఆయిల్ కంపెనీలు పెద్ద యెత్తున పంపుతున్నాయని, దీనిని ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

దళిత యువకుడిపై మూత్రం పోసి.. లైంగికదాడి

- కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం
- బీజేపీ పాలిత రాజస్థాన్‌లో దారుణం

డబుల్ ఇంజిన్ ట్రబుల్

ఫతేపూర్, ఏప్రిల్ 20: దళిత యువకుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి, అతనిపై మూత్ర విసర్జన చేసి కులం పేరుతో దూషించి అవమానించడమే కాక లైంగిక దాడికి పాల్పడిన ఘటన బీజేపీ పాలిత రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. ఫతేపూర్‌లోని సికార్‌లో ఈ నెల 8న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 19 ఏండ్ల దళిత యువకుడు ఒక పెండ్లి ఊరేగింపును తిలకిస్తుండగా, మద్యం సేవించి ఉన్న ఇద్దరు వ్యక్తులు అతడిని బెదిరించి నిర్జన ప్రదేశంలోకి తీసుకుపోయి, కులం పేరుతో దూషించారు. అతడి బట్టలు విప్పించి దారుణంగా కొట్టడమే కాక, అతనిపై అసహజ లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ దృశ్యాన్ని మొబైల్‌లో రికార్డు చేసి ఎవరికైనా చెబితే దానిని వైరల్ చేస్తామంటూ బెదిరించారు. దీనిపై ఆలస్యంగా ఆ యువకుడి తల్లిదండ్రులు ఈ నెల 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితికి ఈ దారుణం అద్దం పడుతున్నదని విపక్ష నేత టికారామ్ జుల్లి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆరాతీసి నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల కమిషనర్ కాదు.. ముస్లిం కమిషనర్

మాజీ సీఈసీ ఖురేషిపై బీజేపీ ఎంపీ దూబే అనుచిత వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: 'సుప్రీం కోర్టే చట్టాలు చేస్తే ఇక పార్లమెంట్ భవనాన్ని మూసేయాలి?' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే మరోసారి నోరుపారేసుకున్నారు. కేంద్ర ఎన్నికల మాజీ ప్రధానాధికారి ఎస్వై ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎన్నికల కమిషనర్ కాదు.. ముస్లిం కమిషనర్ అంటూ ఆరోపించారు. 'వక్ఫ్ చట్టం దుర్మార్గమైనదనడంలో ఎలాంటి సందేహం లేదు. ముస్లింల భూములను లాక్కోవడానికే మోదీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చిందంటూ' ఇటీవల ఖురేషి చేసిన ఆరోపణలపై ఆదివారం ఆయన స్పందిస్తూ 'మీరు ఎన్నికల కమిషనర్ కాదు.. ముస్లిం కమిషనర్. మీ హయాంలోనే గరిష్ఠ సంఖ్యలో బంగ్లాదేశ్ చొరబాటుదారులను జార్ఖండ్‌లోని శాంతల్ పరగణిలో ఓటర్లుగా మార్చారు' అంటూ విమర్శించారు.

దూబేపై కోర్టు ధిక్కార చర్యలు కోరుతూ ఫిర్యాదు

వక్ఫ్ చట్టం కేసులో సుప్రీం కోర్టుపై, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేపై కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభించడానికి అనుమతి ఇవ్వాలని ఆ కేసులో ఒకరి తరపున వాదిస్తున్న సుప్రీం కోర్టు న్యాయవాది అనస్ తన్వీర్ కోరారు. ఈ మేరకు ఆయన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి లేఖ రాశారు.

కర్ణాటక మాజీ డీజీపీ అనుమానాస్పద మృతి

పోలీసుల అదుపులో భార్య, కుమార్తె

బెంగళూరు: కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ బెంగళూరులోని తన నివాసంలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయన మృతదేహం రక్తపు మడుగులో కనిపించింది. దీంతో ఆయనను పదునైన ఆయుధంతో కడుపు, మెడ భాగాల్లో పొడిచి, హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయన భార్యను, కుమార్తెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపించారు. ఓం ప్రకాశ్ డీజీపీ, ఐజీగా 2015 నుంచి 2017 వరకు పని చేశారు.

ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశానం

కుల వివక్ష నిర్మూలనకు ఆరెస్సెస్ చీఫ్ పిలుపు

అలీగఢ్: కులాలపరమైన వ్యత్యాసాలకు ముగింపు పలకాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చీఫ్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. హిందువులందరికీ 'ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశానం' సిద్ధాంతాన్ని అమలుకు గట్టిగా కృషి చేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో సామరస్యం, ఐక్యత సందేశాలను వ్యాపింపజేసేందుకు తమ ఇళ్లకు అన్ని వర్గాలవారినీ ఆహ్వానించాలని స్వయం సేవకులకు చెప్పారు.

7 బ్యాంకులకు రూ.8,346 కోట్ల ఎగవేత

రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఎంటీఎన్‌ఎల్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) కంపెనీ 7 ప్రభుత్వ బ్యాంకులకు రూ.8,346.24 కోట్ల రుణాలను ఎగ్గొట్టింది. ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య కాలంలో ఈ అప్పులను ఎగ్గొట్టినట్టు శనివారం ఓ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఎంటీఎన్ఎల్ వెల్లడించింది.ఈ ఏడాది మార్చి 31 నాటికి తమ మొత్తం అప్పులు రూ.33,568 కోట్లకు చేరగా, అందులో రూ.24,071 కోట్ల సావరిన్ గ్యారెంటీ బాండ్ రుణం కూడా ఉంది.

చైనాలో గోల్డ్ ఏటీఎం

- *బంగారాన్ని కరిగించి, బ్యాంకు ఖాతాలో డబ్బు జమ*
- *అవాక్కవుతున్న నెటిజన్లు*



బీజింగ్: చైనాలోని షాంఘైలో ఉన్న గోల్డ్ ఏటీఎం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నది. ఖాతాదారు దీనిలో బంగారు నాణేలు, కడ్డీలు, ఆభరణాలను ఉంచితే, వాటిని కరిగించి, స్వచ్ఛతను తనిఖీ చేసి.. ఆ బంగారం బరువుకు తగిన మార్కెట్ విలువను డిజిటల్ కరెన్సీ రూపంలో ఖాతాదారు బ్యాంకు ఖాతాకు పంపిస్తున్నది. ఈ ప్రక్రియ కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతుంది. దీని గురించి టర్కిష్ టెక్ ఇన్‌ఫ్లూయెన్సర్ టన్సు యెగెన్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఇది చైనాలో ఏర్పాటు చేసిన మొదటి గోల్డ్ ఏటీఎం. ఈ గోల్డెన్ ఏటీఎంను చూసి నెటిజన్లు అవాక్కవుతున్నారు. భవిష్యత్తులో కరెన్సీ మార్పిడి, ఆర్థిక లావాదేవీల్లో జరిగే మార్పుల గురించి చర్చను ప్రారంభించారు. చైనా అద్భుతాలు సృష్టిస్తున్నదని, తేలికగా, వేగంగా, శక్తిమంతంగా పని చేసే ఇన్నోవేషన్స్ చేస్తున్నదని కొందరు వ్యాఖ్యానించారు. పాత సంపదను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయడానికి నూతన మార్గాలను అన్వేషిస్తున్నదని ప్రశంసించారు. సంప్రదాయ ఆస్తులను తదుపరి తరం ఫిన్‌టెక్‌తో కలపడంలో చైనా దూసుకెళ్తున్నదని కొందరు వ్యాఖ్యానించారు.

కంటికి కనిపించని 'ఓలో' రంగు

కొత్త కలర్‌ను ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు

న్యూయార్క్: అమెరికా శాస్త్రవేత్తలు సరికొత్త రంగును ఆవిష్కరించారు. ఇది కంటికి కనిపించకపోవడం గమనార్హం. ఈ రంగును శాస్త్రవేత్తలు 'ఓలో'గా పిలుస్తున్నారు. ఇప్పటివరకు ఈ రంగును ఐదుగురు మాత్రమే చూశారు. ఆ రంగు పీకాక్ బ్లూ లేదా టీల్ లాగా ఉందని వారు అభివర్ణించారు. ఈ మేరకు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో కథనం ప్రచురితమైంది. బెర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు ఈ కలర్‌ను అభివృద్ధి చేశారు. రెటీనాపై లేజర్ మ్యానిపులేషన్ ద్వారా శాస్త్రవేత్తలు ఈ రంగును చూశారు. రెటీనాలోకి లేజర్‌ను ప్రసరింపజేశారు. దాంతో రెటీనా సాధారణ పరిమితికి మించి చూడగలిగేలా లేజర్ ప్రేరేపించింది. తద్వారా శాస్త్రవేత్తలు ఓలో రంగును చూడగలిగారు.

నాన్ న్యూక్లియర్ హైడ్రోజన్ బాంబు!

- *రెండు సెకన్లలో 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత*
- *విజయవంతంగా పరీక్షించిన చైనా*



బీజింగ్, ఏప్రిల్ 20: దక్షిణ చైనా సముద్ర జలాలపై ఆధిపత్యం కోసం తపిస్తున్న చైనా.. హైడ్రోజన్ బాంబ్ (నాన్-న్యూక్లియర్)ను విజయవంతంగా పరీక్షించింది. తైవాన్‌కు అమెరికా రక్షణ మద్దతు పెరుగుతున్న క్రమంలో ఆ దేశం హైడ్రోజన్ బాంబు పరీక్షలను చేపట్టినట్టు తెలుస్తున్నది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం, పూర్తిగా శుద్ధి చేసిన 2 కిలోగ్రాముల హైడ్రోజన్ బాంబును ఆ చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ అనే సంస్థ అభివృద్ధి చేసింది. సంప్రదాయ అణు బాంబుల మాదిరిగా కాకుండా మెగ్నీషియం హైడ్రేడ్‌తో ఈ నాన్-న్యూక్లియర్ హైడ్రోజన్‌ను తయారుచేసింది. ఇది చాలా శక్తివంతమైన బాంబు. ఒక్కసారి యాక్టివేట్ అయితే, కేవలం రెండు సెకన్లలో 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో కూడిన పేలుడు సంభవిస్తుంది. ఒకేవిధమైన శక్తిని విడుదల చేసే ఫైర్‌బాల్స్ విడుదలవుతూ.. వరుస పేలుళ్లు సంభవిస్తాయి. దీంతో విస్తారమైన ప్రదేశంలోని శత్రు సేనల్ని, వాటి స్థావరాల్ని ఇది సర్వనాశనం చేస్తుంది.

పుట్టిన రోజున భూమ్మీదకు వ్యోమగామి

నాసా వృద్ధ ఆస్ట్రోనాట్ రికార్డ్

మాస్కో: 'నాసా' వ్యోమగాముల్లో అత్యంత వృద్ధుడు డాన్ పెట్టిట్.. సరిగ్గా తన 70వ పుట్టినరోజున అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) భూమ్మీదకు తిరిగి వచ్చారు. దాదాపు 7 నెలలకుపైగా ఐఎస్ఎస్‌లో ఉన్న ఆయన, నాసా యాక్టివ్ వ్యోమగాముల్లో అత్యంత పెద్ద వయస్కుడు. ఆయనతో పాటు మరో ఇద్దరు రష్యా వ్యోమగాములతో బయల్దేరిన సూయజ్ ఎంఎస్-26 క్యాప్సుల్ ఆదివారం కజకిస్థాన్‌లోని ఓ పట్టణానికి సమీపంలో సురక్షితంగా దిగినట్టు రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ 'రోస్‌కాస్మోస్' వెల్లడించింది. మొత్తం 220 రోజులపాటు ఐఎస్ఎస్‌లో గడిపిన డాన్ పెట్టిట్‌కు ఈ అంతరిక్ష యాత్ర నాలుగోది.